teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

## మేడారం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

మేడారంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఈ నెల 13 లేదా 14న పర్యటన షెడ్యూల్



06

ములుగు | సంపుటి : 04 | సంచిక : 95 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 12 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ' 5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.



రాష్ట్రంలో 22 మంది
### అటవీ సిబ్బంది
ప్రాణాలు కోల్పోయారు

అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయం

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

.. వివరాలు 2లో



### కేటీఆర్‌కు అరుదైన గౌరవం

గ్రీన్ లీడర్‌షిప్-2025 అవార్డుకు ఎంపికైన కేటీఆర్

.. వివరాలు 2లో



రాజాసింగ్ వ్యాఖ్యలపై
### స్పందించిన టిబీజేపీ అధ్యక్షుడు

రాష్ట్ర కమిటీలో పేరు లేదని బాధపడొద్దు

పార్టీలో ఇంకా 650 పోస్టులు ఉన్నాయ్

.. వివరాలు 2లో




## స్థానిక సంస్థల ఎన్నికలకు
# గ్రీన్ సిగ్నల్

### పంచాయతీరాజ్, మున్సిపల్ బిల్లులకు పచ్చజెండా

- గవర్నర్ ఆమోదంతో బీసీ రిజర్వేషన్లు 42%కి పెంపు
- త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- ఎన్నికల హామీ నెరవేర్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- సెప్టెంబర్ గడువు ముగియనున్న వేళ కీలక నిర్ణయం

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం అయింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రూపొందించిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ బిల్లులకు సెప్టెంబర్ 9న గవర్నర్ ఆమోదం తెలపడంతో, త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది.

02




గ్రూపు-1 నియమకాలపై
### అప్పీల్‌కు టీజీపీఎస్సీ
# నిర్ణయం

వారం రోజుల్లో పిటిషన్ దాఖలు చేసే అవకాశం

నియామకాల్లో లోపాలు లేవని టీజీపీఎస్సీ మరోసారి స్పష్టం

2



మహిళా సంఘాలకు ప్రభుత్వం
## భారీ ఆర్థిక సాయం

రూ. 6.11 కోట్లు విడుదల, సాధికారతే లక్ష్యం

సంఘాలకు రూ. 15 వేల చొప్పున నిధులు

మహబూబాబాద్‌కు అత్యధిక వాటా

నిధుల పర్యవేక్షణకు డీఆర్డీవోలకు బాధ్యత



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రంలోని 4,079 స్వయం సహాయక

మిగతా 2 లో



ఇందిరమ్మ ఇండ్ల సమస్యలకు
# టోల్ ఫ్రీ కాల్ సెంటర్

నెం.1800 599 5991
ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు, సందేహాల నివృత్తి కోసం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌ను, హెల్ప్ డెస్క్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాల్ సెంటర్ ఫోన్ నెం.1800 599 5991ను

మిగతా 2 లో

కేటీఆర్ నీకు
## నీతి ఎక్కడిది

ఫిరాయింపులపై కోర్టుకు వెళ్లే అర్హత మీకు లేదు

కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. జీన్స్ అనేది పుట్టుకకు సంబంధించింది అని మరి మీ పార్టీలో అప్పుడు చేర్చుకున్న వాళ్లకు ఏం జీన్స్

మిగతా 2 లో



ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు
## చెల్లకపోవడం ఆశ్చర్యం

క్రాస్ ఓటింగ్ పై నేను మాట్లాడను

విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

2

కవితకు స్వగ్రామంకు
## రావాలని ఆహ్వానం

ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలో పాల్గొనాలని విజ్ఞప్తి



2

గొర్రెల స్కామ్ కేసులో
# కీలక పరిణామం

తాజాగా బాధితులకు ఈడీ నోటీసులు

ఈనెల 15న విచారణకు హాజరుకావాలని ఆదేశాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన గొర్రెల స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ తాజాగా బాధితులకు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈనెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి వారికి దళారి వ్యాపారి మొయినుద్దీన్ డబ్బులు చెల్లించలేదు. రైతులకు చెల్లించాల్సిన డబ్బును

మిగతా 2 లో

# స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం అయింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రూపొందించిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ బిల్లులకు సెప్టెంబర్ 9న గవర్నర్ ఆమోదం తెలపడంతో, త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది.




**బీసీ రిజర్వేషన్లకు మార్గం సుగమం**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన కీలక హామీలలో బీసీ రిజర్వేషన్ల పెంపు ఒకటి. రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి మార్చిలో అసెంబ్లీలో రెండు బిల్లులను ఆమోదించింది. ఈ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రానికి పంపబడ్డాయి. అయితే, దీనిపై కేంద్రం నుండి స్పందన లేకపోవడంతో, పెరిగిన బీసీ కోటాతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ చర్యలు:**

గ్రామ పంచాయతీలలో రిజర్వేషన్లను ఖరారు చేయడానికి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన గడువు సెప్టెంబర్ నెలతో ముగియనుంది. జూలై చివరి నాటికి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి, సెప్టెంబర్ 30 నాటికి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, చట్టాన్ని సవరించాలని పంచాయతీ రాజ్ శాఖ ప్రతిపాదించగా, దానికి న్యాయ శాఖ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శాసనసభ ఈ ప్రతిపాదనను ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపింది.

**గవర్నర్ ఆమోదం:**

ఆగస్టు 31న అసెంబ్లీలో, సెప్టెంబర్ 1న శాసన మండలిలో ఆమోదం పొందిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను సెప్టెంబర్ 2న రాజ్ భవన్ కు పంపింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ బిల్లులపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లీగల్ ఒపీనియన్ తీసుకుని సెప్టెంబర్ 9న ఆమోదం తెలిపారు. ఈ బిల్లులు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయడంతో పాటు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాయి.

**స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్:**

గవర్నర్ ఆమోదం తెలపడంతో, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు మార్గం క్లియర్ అయ్యింది. త్వరలోనే ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. దీని తర్వాత గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు, కుల గణన డేటా ఆధారంగా, బీసీ కోటాను పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక పరిణామంగా పరిగణించబడుతోంది.

**కీలక అంశాలు:**

గవర్నర్ ఆమోదం: పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం.

రిజర్వేషన్ల పెంపు: స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు.

సుప్రీంకోర్టు పరిమితి ఎత్తివేత: రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తివేస్తూ చట్ట సవరణ. ఎన్నికలకు సన్నాహాలు: గెజిట్ విడుదల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం. ప్రభుత్వ హామీ: 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన కీలక హామీలలో ఇది ఒకటి. ఈ పరిణామం రాష్ట్రంలో రాజకీయ సమీకరణలను మార్చడమే కాకుండా, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల ప్రాతినిధ్యం గణనీయంగా పెంచే అవకాశం ఉంది.

## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు చెల్లకపోవడం ఆశ్చర్యం



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అంశం జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఎన్డీఏ కూటమి అభ్యర్థి సి.పి రాధాకృష్ణన్ కు 452 ఓట్లు, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పడ్డాయి. ఎన్డీయే కూటమి వాస్తవ సంఖ్యా బలం కంటే 14 ఓట్లు ఎక్కువ రావడంతో ప్రతిపక్ష కూటమిలో క్రాస్ ఓటింగ్ జరిగిందనే వాదన బలపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్పందించారు. క్రాస్ ఓటింగ్ పై నేను మాట్లాడనని దేశ ప్రజలందరూ చూశారన్నారు. తాజాగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన పార్టీల్లో చేరి పదవుల కోసం పాకులాడే అవసరం తనకు లేదన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు చెల్లకపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు.

## కవితకు స్వగ్రామంకు రావాలని ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు కేసీఆర్ స్వగ్రామం చింతమడకకు రావాలని ఆహ్వానం అందింది. చింతమడకలో ఈనెల 21న జరగబోయే ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలకు రావాలని కొంతమంది గ్రామస్తులు వచ్చిన కవితను ఆహ్వానించారు. కేసీఆర్ స్వగ్రామం నుండి కవితకు ఆహ్వానం అందడం ఆసక్తికరంగా మారింది. కవితను బీఆర్ఎస్ బహిష్కరించిన సంగతి తెలిసిందే. చాలా కాలంగా కవిత పార్టీకి దూరంగా ఉండటంతో పాటు హరీష్ రావు, సంతోష్ రావులపై ఆరోపణలు చేశారు. వాళ్లిద్దరూ తమ కుటుంబంపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆ తరవాత బీఆర్ఎస్ నుండి ఆమెను సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. అయితే గతంలో బతుకమ్మ ఉత్సవాల్లో జాగృతి కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. బతుకమ్మ ఉత్సవాల సమయంలో కవిత అనేక ప్రాంతాలకు వెళ్లి మహిళలతో కలిసి ఆడేవారు. ప్రస్తుతం ఆ పార్టీలో లేనప్పటికీ కేసీఆర్ స్వగ్రామంలో జరిగే వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉంది.

## కేటీఆర్‌కు అరుదైన గౌరవం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు అరుదైన గౌరవం లభించింది. గ్రీన్ లీడర్‌షిప్-2025 అవార్డుకు కేటీఆర్ ఎంపికయ్యారు. అమెరికాలోని న్యూయార్క్‌లో ఈ అవార్డును కేటీఆర్ అందుకోనున్నారు. సెప్టెంబర్ 24న న్యూయార్క్ నగరంలో 9వ NYC గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో ప్రదానోత్సవం జరుగనుంది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో ఆయన చేసిన కృషికి గాను ప్రతిష్టాత్మకమైన గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025కు కేటీఆర్ ఎంపికయ్యారు.

## మహిళా సంఘాలకు ప్రభుత్వం భారీ ఆర్థిక సాయం

మొదటి పేజీ తరువాయి

సంఘాలకు (ఎస్హెచ్‌జీలకు) రివాల్వింగ్ ఫండ్ గ్రాంట్ కింద రూ. 6,11,85,000 విడుదల చేస్తూ సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఉత్తర్వుల జారీ చేశారు. ఒక్కో స్వయం సహాయక సంఘానికి రూ. 15,000 చొప్పున ఈ నిధులు మంజూరు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి, సభ్యుల ఆర్థిక స్థిరత్వానికి ఉపయోగపడనుంది.

**నిధుల పర్యవేక్షణ:**

ఈ నిధుల వినియోగాన్ని పర్యవేక్షించే బాధ్యతను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులకు (డీఆర్డీఓలు) సెర్ప్ అప్పగించింది. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) రివాల్వింగ్ ఫండ్ మార్గదర్శకాల ప్రకారం ఈ నిధులు ఉపయోగపడుతున్నాయో లేదో డీఆర్డీఓలు నిశితంగా పరిశీలించాలని సూచించింది. అలాగే, జిల్లా, మండల, గ్రామ సమాఖ్యలు కూడా ఈ నిధుల వినియోగాన్ని సమీక్షించి పర్యవేక్షించాలని సెర్ప్ కోరింది.

**జిల్లాల వారీగా నిధుల పంపిణీ:**

మొత్తం 32 జిల్లాల్లోని స్వయం సహాయక



సంఘాలకు ఈ నిధులు పంపిణీ అయ్యాయి. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలోని 397 సంఘాలకు నిధులు అందాయి. ఆ తర్వాత జోగులాంబ గద్వాల (353), భద్రాద్రి కొత్తగూడెం (332), మహబూబ్‌నగర్ (264), కొమరంభీం (259), నాగర్ కర్నూల్ (206), నల్గొండ (201), వనపర్తి (198), ఆదిలాబాద్ (193) జిల్లాల్లో అధిక సంఖ్యలో సంఘాలు లబ్ధి పొందాయి. మరోవైపు, అతి తక్కువగా మంచిర్యాల జిల్లాలో కేవలం 3 సంఘాలకు మాత్రమే నిధులు విడుదలయ్యాయి. ఈ నిధుల విడుదల మహిళా సాధికారత వైపు ప్రభుత్వం వేసిన ఒక కీలకమైన అడుగుగా పరిగణించవచ్చు.

## రాష్ట్రంలో 22 మంది అటవీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నెహ్రూ జువాలాజికల్ పార్క్ లో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11వ తేదీన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రతి సంవత్సరం ఈ రోజున అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నాం అన్నారు. 1730 వ సంవత్సరములో రాజస్థాన్ రాష్ట్రంలో బిష్ణోయి తెగకు చెందిన 360 మంది కేజ్రి చెట్లను రక్షించేందుకు తమ ప్రాణ త్యాగం చేశారని మంత్రి తెలిపారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధినిర్వహణలో వన సంపద సంరక్షణ కొరకు జీవితములను త్యాగం చేసిన అటవీ సిబ్బంది సేవలను స్మరించుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 1984వ సంవత్సరం నుండి ఇప్పటివరకు 22 మంది అటవీ సిబ్బంది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేసే అటవీ నేరాలకు పాల్పడిన నేరస్తులను పట్టుకోవడంలో తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. అటవీ రక్షణలో భాగంగా 2014 నుంచి 2025 జూలై మాసం వరకు టేకు అలాగే మారు జాతి కలపకు సంబంధించిన కేసులు, 10375 అటవీ భూ



ఆక్రమణ కేసులను కూడా నమోదు చేయడం జరిగిందని అన్నారు. 2025 సంవత్సరంలో రూ. 149.66 కోట్ల కలపకు గాను 96,813 కేసులు నమోదు చేసి రూ 51.50 కోట్ల జరిమానా వసూలు చేయడం జరిగిందని, 18002 వాహనాలను కూడా స్వాధీన పరచు కోవడం జరిగిందని అన్నారు. నేరస్తులు తెలియని కేసులు 29,858 నమోదు చేసి రూ. లు 67.13 కోట్ల విలువ కలిగిన టేకు, మారు జాతి కలపను స్వాధీనపరచుకొని జప్తు చేయడం జరిగిందని, 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అడవుల సంరక్షణకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా 2,118 వాహనాలు అటవీ అధికారులకు అందించామని వెల్లడించారు. 2022 సంవత్సరంలో 1516 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిందని, ఇందులో 1393 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, 15 మంది ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, 18 మంది ఏసిఎఫ్ ఇతర పోస్టులు రిక్రూట్‌మెంట్ ప్రక్రియలోఉన్నాయని పేర్కొన్నారు.

## గ్రూపు-1 నియమకాలపై అప్పీల్‌కు టీజీపీఎస్సీ నిర్ణయం



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గ్రూపు-1 నియమకాలపై అప్పీల్‌కు వెళ్లాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయనుంది. వారం రోజుల్లో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం ఇప్పటికే న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది. గ్రూప్-1 పరీక్షల్లో ఇప్పటివరకు జరిగిన ప్రక్రియలను వివరించాలని భావిస్తున్నది. ఈ విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై పలువురు న్యాయ నిపుణలతో మాట్లాడిన్నట్టు తెలిసింది. గ్రూపు-1 నియామకాల్లో ఎలాంటి లోపాలు లేవని టీజీపీఎస్సీ మరోసారి స్పష్టం చేసింది.

## ఇందిరమ్మ ఇండ్ల సమస్యలకు టోల్ ఫ్రీ కాల్ సెంటర్

మొదటి పేజీ తరువాయి

ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ కాల్ సెంటర్ ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటలవరకు పనిచేస్తుందని ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడంతోపాటు, వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడానికి ఈ కాల్ సెంటర్‌ను వినియోగించుకోవచ్చునన్నారు. లబ్ధిదారుల ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు ఆధారంగా వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటారని నిర్ణీత గడువులోగా బిల్లులు జమ కాకపోవడం, ఎక్కడైనా ఎవరైనా సిబ్బంది ఫోటోలను అప్ లోడ్ చేయడంలో ఆలస్యం చేయడం, ఇతర సాంకేతిక సమస్యలు, అవినీతి ఆరోపణలు తదితర అంశాలపై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్లి చర్యలు తీసుకుని లబ్ధిదారులకు కూడా ఆ వివరాలను తెలియచేస్తారని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ, పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని, ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా మంచి ఫలితాలు సాధించామని, కృత్రిమ మేధ ను కూడా విరివిగా వాడుతున్నామని, ఈ కాల్ సెంటర్ ద్వారా లబ్ధిదారులకు మరింత చేరువ అవుతున్నామని మంత్రి పేర్కొన్నారు. అవినీతికి ఎటువంటి ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం 5 లక్షల రూపాయల సబ్సిడీతో పేదలకు ఇండ్ల నిర్మాణానికి సహాయం అందిస్తోందని తెలిపారు.

## గొర్రెల స్కామ్ కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి

బినామీ ఖాతాలకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, బ్రోకర్లు కుమ్మక్కై రైతులకు దక్కాల్సిన నిధులు స్వాహా చేశారని ఇందులో పశుసంవర్ధక శాఖకు చెందిన సీనియర్ అధికారులు, మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ పైనా కూడా కేసులు నమోదు అయ్యాయి. రూ.2.1కోట్ల మేర అక్రమాలు జరిగాయనే కోణంలో అవినీతి నిరోధకశాఖ ప్రారంభించిన దర్యాప్తులోనే సుమారు రూ.700 కోట్ల మేర కుంభకోణం జరిగిందని ప్రాథమికంగా తేలగా ఏసీబీ విచారణ ఆధారంగా ఈ కేసులోకి ఈడీ ఎంటరైంది. ఈక్రమంలో ఈ గొర్రెల్ స్కామ్ లో రూ.1,000 కోట్లకుపైగా దారి మళ్లి ఉంటాయనే ఈడీ అంచనాకు వచ్చింది.

## కేటీఆర్ నీకు నీతి ఎక్కడిది

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని ప్రశ్నించారు. నాడు రాజ్యాంగ ఉల్లంఘన చేసి కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను చేర్చుకున్న నువ్వు ఇవ్వాళ కోర్టుకు వెళుతున్నావా. కేటీఆర్ నీకు నీతి ఎక్కడిది అని ప్రశ్నించారు. రాజీనామా చేయకుండానే మీ పార్టీలోకి చేర్చుకున్న ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కూడా ఇచ్చారని అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డిని మీ పార్టీలోకి చేర్చుకుని మంత్రి పదవులు ఇవ్వలేదా అని అడిగారు. మీకు దమ్మంటే అప్పుడు మీ పార్టీలో జాయిన్ అయి ఇప్పుడు పదవిలో ఉన్న ఎమ్మెల్యేలను రాజీనామా చేయమను అంటూ సవాల్ చేశారు. ఫిరాయింపులపై కోర్టుకు వెళ్లే అర్హత మీకు లేదని అన్నారు. 2014, 2018లో భయపెట్టి, బెదిరించి టార్చర్ చేసి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీలను మీ పార్టీలోకి తీసుకోలేదా అని నిలదీశారు. యూట్యూబ్‌లు పెట్టుకుని పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడించిన మాత్రాన తమకు ఏమీ కాదన్నారు. మీరేం చేశారో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు.

## రాజాసింగ్ వ్యాఖ్యలపై స్పందించిన టిబీజేపీ అధ్యక్షుడు



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ఇప్పుడున్న రాష్ట్ర కమిటీతో అసెంబ్లీ ఎన్నికలకు వెళితే బీజేపీ తెలంగాణలో ఎప్పటికీ అధికారంలోకి రాదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాట్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీలో పార్టీ కోసం కష్టపడే అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర కమిటీలో పేరు లేనివారు బాధపడొద్దని సూచించారు. పార్టీలో ఇంకా 650 పోస్టులు ఉన్నాయని చెప్పారు. నిరాశలో ఉన్న వారిని పార్టీ కార్యక్రమాల్లో యాక్టీవ్ చేస్తామని అన్నారు. రాష్ట్ర కమిటీలో అన్ని ఉమ్మడి జిల్లాలకు న్యాయం జరిగిందని చెప్పుకొచ్చారు. వరంగల్ జిల్లాకు అధికార ప్రతినిధి పదవితో న్యాయం చేస్తామని కీలక హామీ ఇచ్చారు. పార్టీలో ఎవరు ఏదైనా మాట్లాడొచ్చు అని అన్నారు. తాము అధిష్టానం డైరెక్షన్‌కు అనుగుణంగా రాజాసింగ్ విషయంలో ముందుకు వెళ్తామని అన్నారు.

# భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ప్రతి ఒక్క దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్ లతో కలిసి సాదాబైనామాల దరఖాస్తుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, భూ పరమైన వివాదాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యు సదస్సులో వచ్చిన సాదాబైనామ కు సంబందించిన దరఖాస్తులు ఎన్ని, అందులో ఎన్ని నోటీసులు జనరేట్ చేసి సర్వే ప్రక్రియ పూర్తి చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయి, పెండింగ్ కి గల కారణాలను కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ పెండింగ్ ఉన్న మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి, వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీఓ లాగిన్ లో ఉన్న విరాసిత్, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేరు, సర్ నెమ్, తదితర పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలని, అదేవిధంగా భూ భారతి అప్లికేషన్‌లో నమోదవుతున్న సాదా బైనామాలు, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్, గ్రీవెన్స్ దరఖాస్తులు వాటి పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అనధికారికంగా లేఅవుట్లు పూర్తిగా అక్రమమైనవి

**ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుమతులు ఇవ్వబడవు**



ములుగు, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ములుగు పురపాలక పరిధిలో అనధికారికంగా లేఅవుట్లు వేసి ప్రజలకు ప్లాట్లు విక్రయిస్తున్న ఘటనలు పురపాలక సంస్థ దృష్టికి వచ్చాయి. ఈ విధమైన లే-అవుట్లు పూర్తిగా అక్రమమైనవి. ఇలాంటి అనధికారిక లే-అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి భవన అనుమతులు, నీరు, డ్రైనేజీ, విద్యుత్ మరియు ఇతర మున్సిపల్ సేవలు ఇవ్వబడవు. ప్రజలు మోసపోవకుండా ఉండేందుకు, ఎవరైనా ప్లాటు కొనుగోలు చేయడానికి ముందు తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయంలో ఆ లే-అవుట్‌కు అప్రూవల్ ఉన్నదో లేదో ధృవీకరించుకోవాలి. అక్రమ లే-అవుట్లను ప్రమోట్ చేస్తున్న వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఈ విషయమై ప్రజలు జాగ్రత్తగా ఉండి మున్సిపల్ సంఘం కు సహకరించవలసిందిగా కోరుతున్నాము.

# అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ నివేదిక సమర్పించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**




ఎస్.ఎస్. తాడ్వాయి, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): మేడారం జాతర కు సంబంధించిన పనులు భక్తులు సంతృప్తిగా అమ్మవార్లను దర్శించుకునేలా ఏర్పాట్లు చేయుటకు, అన్ని శాఖ ల అధికారులు జయింట్ ఇన్స్పెక్షన్ చేసి వారం లోగా నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారం ఐటిడిఎ గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్ పి శబరిష్, ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సి. హెచ్. మహేందర్ జి, సంపత్ రావులతో కలసి సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిఆర్, ఆర్ అండ్ బి, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్ డబ్లూ ఎస్, రెవిన్యూ, ఫారెస్ట్, పోలీస్, విద్యుత్, శాఖ ల అధికారులు జయింట్ ఇన్స్పెక్షన్ చేసి వారం లోగా నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రతి శాఖకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయేట్లు, పనులు క్షేత్ర స్థాయిలో ప్రారంభించేట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన మహా మేడారం జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. మేడారం సంబంధ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు మేడారం లో క్షేత్ర స్థాయిలో ఉండాలని, పనుల పురోగతి పై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని అన్నారు. విధులు కేటాయించబడిన ఎఇ, డిఇలు మేడారంలోనే ఉండి, పనులు చేపట్టాలని, ఈఈలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం క్షేత్ర సందర్శన చేసి, పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. మేడారం జాతరకు సుమారు కోటి యాభై లక్షల పైగా భక్తులు రానున్నట్లు అంచనా ఉన్నట్లు, వన దేవతల పండుగ, వనంలో పండుగ, చుట్టూతా వనం, ప్రక్కనే వన్య ప్రాణులు కాబట్టి, వనాన్ని, వనంలోని ప్రాణులను కాపాడుకొనే దిశగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, ఈ ఓ వీరస్వామి , జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, తహసిల్దార్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలి

**గ్రూప్ వన్ అభ్యర్థులకు న్యాయం చేయాలి**
**సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థుల విషయంపై నోరు విప్పాలి**
**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం**
**ఈ క్రమంలో అడ్డుకున్న పోలీసులు**
**మంద శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**



హనుమకొండ కేయు, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ని ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. గురువారం రోజున కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపల్ ఆఫీస్ నుండి మొదట వరకు ర్యాలీగా ప్రభుత్వ దిష్టి బొమ్మ తో వచ్చి మొదటి గేటు ముందు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు రాష్ట్రంలో జాబు క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. గ్రూప్ వన్ పరీక్షల అవకతకులపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. వివాదాలకు నిలయంగా ఉన్న టీజీ పీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూపు వన్ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. గతంలో టీజీపీఎస్సీ చేసిన తప్పిదల వల్ల రెండుసార్లు గ్రూపు వన్ పరీక్షలు ఫిలిమ్స్ రద్దయిందని అన్నారు మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన గ్రూపు 1 మెయిన్స్ పరీక్ష హాల్ టికెట్ల దగ్గర్నుంచి మూల్యాంకనం వరకు వరుస వివాదాలకు టీజీపీఎస్సీ కేంద్ర బిందువు అయిందన్నారు. నిరుద్యోగ యువత లక్షలాది రూపాయలు కోచింగ్ సెంటర్లలో వెచ్చించి శిక్షణ పొంది పరీక్షలకు హాజరవుతున్నారని అన్నారు. ఈ క్రమంలో పారదర్శకంగా నియామకాలు చేపట్టాల్సిన టిజిపిఎస్సి వివాదాలు సూచించే విధంగా వ్యవహరిస్తు నిరుద్యోగుల జీవితాలతో చలగాటం ఆడుతుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ వరుస తప్పిదాలతో లక్షలాది మంది నిరుద్యోగ యువతను మోసం చేస్తుందన్నారు పరీక్ష నిర్వహించినప్పటి నుంచి అనేక అనుమానాలకు తావిచ్చిన టీజీపీఎస్సీ పై ప్రభుత్వం సమీక్ష నిర్వహించలేదన్నారు పరీక్ష పత్రాలను నిపుణులైన ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించాలన్నారు. తెలుగు మీడియం పేపర్లను తెలుగు మీడియం వారితోనే చేయించాలని ఇంగ్లీష్ మీడియం పేపర్లను ఇంగ్లీష్ మీడియంకు సంబంధించిన నిపుణులతో మూల్యంకనం చేయించాలన్నరూ ఇంత జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు నోరు విప్పడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ స్పందించి గ్రూపు 1 పరీక్షల అవతలపై ప్రభుత్వం విచారణ చేపట్టి దీనికి కారణమైన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్ జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరీ సాయికుమార్ పవన్ కుమార్ మల్లేష్ రాహుల్ రణదీప్ రాజ్ కుమార్ సందీప్ వినయ్ సాయి తదితరులు పాల్గొన్నారు.




# ముఖ్యమంత్రి సభను అడ్డుకుంటాం



**కామారెడ్డి వేదికగా ఇచ్చిన హామీలు అమలు చేయాలి**
**ముదిరాజులకు ప్రభుత్వాలను మార్చే శక్తి ఉంది**
**ముదిరాజులను బిసి డి నుండి బీసీ ఏ లోకి మార్చాలి**
**జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్**

హుస్నాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ఈనెల 15న కామారెడ్డిలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయోత్సవ సభను అడ్డుకుంటామని ముదిరాజ్ అక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం హుస్నాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముదిరాజులను బీసీ డి నుండి బీసీ ఏలోకి మారుస్తానని ఇచ్చిన మాట ను మర్చిపోయాడన్నారు. ముదిరాజులకు ఇచ్చిన హామీలను మర్చిపోతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఉందన్నారు. కామారెడ్డి విజయోత్సవ సభకు ముందుగానే ముదిరాజుల ప్రకటన వెలబడాలన్నారు. లేకుంటే కామారెడ్డి లో జరిగే సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. ముదిరాజ్ హక్కుల సాధన సమితి యువత అధ్యక్షులు పడిగ ప్రశాంత్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మేడికాయల వెంకటేశం, సిద్దిపేట జిల్లా మీడియా కన్వీనర్ పుప్పాల బాలేష్, హుస్నాబాద్ మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్, నియోజకవర్గం అధ్యక్షులు చొప్పర శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొల్లి శ్రీనివాస్, భాష వేణి రాజయ్య, సొసైటీ అధ్యక్షులు పొన్నం మల్లయ్య,, పెసరు రాజయ్య, శ్రీనివాస్, రవి, పడిగలింగం, సుధాకర్, సుతార్ రాజు, రావుల రాజు, చేరుకు నారాయణ పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమానికి హాజరై బడే నాగజ్యోతి



గంగారం, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గంగారం మండలంలోని మాదేగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బీరబోయిన చెన్నయ్య అనారోగ్యంతో మృతి చెందినారు. ఈరోజు వారి స్వగృహానికి వెళ్లి దశదిన కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన బడే నాగజ్యోతి. ఈ కార్యక్రమంలో గంగారం మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య, కొత్తగూడ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, గోగుల లక్ష్మయ్య, ఈసం నాగేశ్వరరావు, ఈసం సారయ్య, అజ్మీర రాము, బిక్షపతి, తాటి కృష్ణారావు, తాటి పాపయ్య, తాటి కన్నయ్య, గోగ్గుల నర్సింగరావు, యాప నాగన్న, యాప కిరణ్, కల్తీ కమల, భాను జవహర్ నెహ్రు, భూపతి తిరుపతి, మొక్కల సంతోష్ రాణి వెంకటేష్, ననుబోతుల లింగన్న, వాసం వెంకన్న, బానోత్ వీరన్న, ఆవుల రమేష్, బుర్కా మల్లయ్య, బొల్లం రవి, బొల్లం అనిల్, అజ్మీర రమేష్ నాయక్, పస్తాం ఎల్లయ్య, జిమిడి శ్రీను, పసుల గట్టయ్య, పెక్క సమ్మయ్య, పస్తాం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

**ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గురువారం కలెక్టర్ కార్యాలయంలో భూ భారతి, సాదా బైనామ, జాతీయ కుటుంబ లబ్ది పథకం, సి.ఎం. ప్రజావాణి దరఖాస్తుల పై అదనపు కలెక్టర్ బెన్షా లోమ్, ఆర్డీఓ లు గోపిరామ్, వెంకన్న ల తో కలిసి తహసీల్దార్ లతో సమీక్షించారు. భూ భారతి దరఖాస్తు లను వేగవంతంగా పరిష్కరించడంలో తహసీల్దార్ ల సందేహాలను నివృత్తి పరుస్తూ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. సర్వేయర్లు, గ్రామపంచాయతీ అధికారుల సేవలను వినియోగించుకొని సత్వరమే పరిష్కరించాలన్నారు. శిక్షణ పొందిన సర్వేయర్ల ను క్షేత్ర స్థాయి పర్యవేక్షణ కు తీసుకెళ్లాలని, కార్యాలయాలలో దరఖాస్తుల పరిశీలన లకు ఉపయోగించాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులతో పనులు తీసుకోవాలన్నారు. సి.ఎం. ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, జాతీయ కుటుంబ లబ్ధిదారుల పథకం అమలుకు లబ్దిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. యూరియా పంపిణీ సక్రమంగా జరిగే విధంగా విస్తృతంగా తనిఖీలు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రికార్డ్ లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. యూరియా స్టాకు, గోడౌన్ లో నిల్వ, విక్రయించిన వివరాలు, కొనుగోలు చేసిన రైతుల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేశారా లేదా అన్నది సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవోలు గోపిరామ్, డి.ఎస్.వెంకన్న, కలక్టరేట్ ఏ.ఓ.శ్రీకాంత్, తహసీల్దార్ లు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సహకార సంఘాల ద్వారా ఎరువుల పంపిణీ

**జిల్లాలో యూరియా కొరత అసత్య ప్రచారం**

**రైతులు నమ్మవద్దు**

**జిల్లా సహకార శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు**



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, లతో కలిసి జిల్లా సహకార శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో జిల్లాలో యూరియా సరఫరా (పంపిణీ) పై పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్క రైతుకు యూరియా అందించడం కోసం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, వ్యవసాయ, సహకార, అన్ని విభాగాలతో జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకొని ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతుందని (18) మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించి ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిశీలిస్తూ నివేదికలు కోరుచూ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా రైతులను కలుస్తూ అధికారులను అప్రమత్తం చేస్తూ ఉన్నారని, ప్రస్తుతం అందిస్తున్న యూరియా వచ్చే యూరియా వివరాలను క్లస్టర్ల వారిగా రైతులకు సమాచారం అందిస్తూ ఉన్నారని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. జిల్లాలో (44) యూరియా అమ్మకాల కేంద్రాలు , (20) రైతు వేదికల ద్వారా మొత్తం (64) కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మరో (10) కేంద్రాల నిర్వహణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అందులో ఇప్పటికే రెండు కేంద్రాలకు లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి 2500 ఎకరాలకు ఒక ఎరువుల అమ్మకాల కేంద్రాలను ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం ఆరు గంటలకే అమ్మకాలను కొనసాగించడం జరుగుతుందని,గతంలో ఎరువుల సరఫరా పంపిణీ సంఘం యొక్క ముఖ్య కేంద్రాలలో మాత్రమే పంపిణీ చేయబడేదనీ, అందువల్ల రైతులు అనేక ఇబ్బందికరమైన పరిస్థితి ఉండేదనీ ఈ పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్, సేల్స్ పాయింట్ల వికేంద్రీకరణ వలన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, అదనంగా ఎరువుల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయమని ఆదేశించడం వలన (64) కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం ద్వారా రైతుల సమయము వృధా కాకుండా ఉంటుందని అందుకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 27 వేల 347 మెట్రిక్ టన్నుల యూరియా సహకార సంఘాల ద్వారా సరఫరా చేయడం జరిగిందన్నారు. రైతులు భవిష్యత్తులో యూరియా దొరకదనే అసత్య ప్రచారాలను నమ్మి అవసరానికి మించి గృహాలలో యూరియాను నిలువల ద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, రైతుల అవసరానికి అనుగుణంగా యూరియా సరఫరా చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఎం.విజయనిర్మల మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు మూడు లక్షల 70 వేల ఎకరాలలో పంట సాగు చేయడం జరిగిందని, మొత్తం నాలుగు లక్షల 20వేల ఎకరాల పంట ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 27. వేల 347 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ గారి నిత్య పర్యవేక్షణలో రైతులకు (44) సొసైటీలకు అనుసంధానంగా తాత్కాలికంగా విక్రయ కేంద్రాలుగా (20) రైతు వేదికలను ఏర్పాటు చేసి రైతులకు వారి వారి గ్రామాలలోనే యూరియాను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. అందువలన రైతులు ఎక్కువ దూరం ప్రయాణం చేయకుండా సమయం వృధా చేయకుండా వారి వారి గ్రామాలకే యూరియా సరఫరా చేయడం వలన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆమె అన్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ప్రతినిత్యం జిల్లాలోని సీనియర్ అధికారులను, ప్రత్యేక అధికారులుగా నియమించి వారితో పాటు తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సహకార శాఖ, అన్ని విభాగాల ను సమన్వయపరిచి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆధ్వర్యంలో రైతులకు రక్షణ కల్పించడం కోసం సంబంధిత కేంద్రాల కేంద్రాల వద్ద తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతు భరోసా పోర్టల్ లో ఉన్నటువంటి వివరాల ప్రకారం రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ యొక్క పాస్ బుక్ ఆధార్ కార్డు, జిరాక్స్ ప్రతులను తీసుకొని కేంద్రానికి రావాల్సిందిగా కోరారు. కావున జిల్లాలోని రైతులు ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని నిరంతరం యూరియా పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని ఆమె తెలిపారు. కలెక్టర్ హైదరాబాదులోని ప్రధాన కార్యాలయంతో నిత్యం అందుబాటులో ఉంటూ జిల్లాకు అధిక యూరియా కోటా కోసం కృషి చేస్తూ అందుకు అనుగుణంగా పనిచేస్తున్నారని ఆమె అన్నారు.

## యూరియా పంపిణి కార్యక్రమాన్ని పరిశీలించిన కమిటీ



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గురువారం మరిపెడ మండల ప్రాథమిక సహకార పరపతి సంఘం చైర్మన్ చాపల యాదగిరి రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడిఏ విజయ్ చందర్ రెడ్డి, ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, తహసిల్దార్ క్రిష్ణవేణి, ఏవో వీరాసింగ్, తదితరులతో కలిసి సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్న యూరియా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా యాదగిరి రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాకు సహకార సంఘాల ద్వారా పంపిణీ చేయుటకు పకడ్బందీ చర్యలు తీసుకొని ప్రతి ఒక రైతుకు యూనియన్ అందించడం జరుగుతుందని మరిపెడ క్లస్టర్ కు సంబంధించి రైతుల వివరాలు సేకరించి అందుకు అనుగుణంగా యూరియాను పంపిణీ చేస్తున్నామని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు, గురువారం అబ్బాయి పాలెం, తాళ్ల ఊకళ్ళు, ఇంకం పహాడ్, ఎల్లంపేట, ఉల్లేపల్లి, తదితర గ్రామాల సొసైటీలకు పంపిణీ చేయడం జరిగిందని, రైతులు అనవసర వదంతులు నమ్మవద్దని యూరియా కావలసినంత ప్రభుత్వము నుండి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతుల వివరాల ఆధారంగా వ్యవసాయ శాఖ అధికారులు సహకార శాఖ అధికారులు పకడ్బందీ ప్రణాళికలతో ప్రతి ఒక రైతుకు యూరియా అందెందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారన్నారు. రోజువారి వచ్చే యూరియా వివరాలు సమాచారం రైతులకు అందిస్తూ ఎలాంటి ఇబ్బందికర పరిస్తితులు లేకుండా చర్యలు తీసుకున్నాం జరుగుతుందని, కేంద్రాలలో త్రాగునీరు టెంటు చైర్స్ సదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. యూరియా తీసుకుంటున్న రైతు యొక్క అభిప్రాయాలను సేకరించి అందుకు అనుగుణంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాప్యం చేసే కాంట్రాక్టర్లుకు నోటీసులు జారీ చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలు నిర్మాణంలో జాప్యం చేసే కాంట్రాక్టర్లుకు నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నిర్మాణ పనులు, వైద్య సిబ్బంది సమయ పాలన, ఖాళీ పోస్టులు భర్తీ తదితర అంశాలపై పంచాయతి రాజ్, టిజిఎంఐడిసి, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఆసుపత్రిలో గోడలపై గుట్కా, ఉమ్మి వేస్తున్నారని, దాని వల్ల అపరిశుభ్రంగా ఉంటుందని, వైద్య సేవలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పరిశుభ్రత పాటించాలని తెలిపారు. నిర్మాణంలో వచ్చే వ్యర్థాలు ఎప్పటి కపుడు తొలగించాలని సూచించారు. ప్రధాన ఆసుపత్రిలో విద్యుత్తు టు ఫేస్ నుండి త్రి ఫేస్ కు మార్చాల్సి ఉందని ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు. ఆసుపత్రి భవనాలు నిర్మాణంలో జాప్యం జరిగే కాంట్రాక్టర్లు కు నోటీసులు జారీ చేయాలని, స్పందించకపోతే బ్లాక్ లిస్టులో పెట్టాలని తెలిపారు. మహాదేవపూర్ ఆసుపత్రిలో ప్రసూతి వైద్యులు నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రిటికల్ కేర్ కేంద్రం నిర్మాణంలో జాప్యం జరుగుతుందని, ఇప్పటికే 2 నోటీసులు జారీ చేశామని పనులు ప్రారంభించకపోతే మళ్ళీ నోటీసు జారీ చేసి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గత సంవత్సరం పూర్తి కావాల్సి ఉందని ఇప్పటికే సంవత్సరం దాటి పోయిందని చర్యలు తీసుకోవాలని తెలిపారు. చాలా ప్రాధాన్యత పనులని జాప్యం చేయొద్దని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, టిజిఎంఐడిసి ఈఈ కె ఎస్కె ప్రసాద్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, అదనపు వైద్యాధికారి డా శ్రీదేవి, ఆసుపత్రుల సమన్వయ అధికారి డా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి

**జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్**




హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): జిల్లాలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్, పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, జిల్లా సంక్షేమ, వైద్య ఆరోగ్య, నార్కోటిక్స్ శాఖల ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సులు, నమోదైన కేసులు, తీసుకుంటున్న చర్యలపై సంబంధిత శాఖల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్ మాట్లాడుతూ గంజాయి,ఇతర మత్తు పదార్థాల బారీన ఎవరు కూడా పడకుండా పోలీస్, ఇతర శాఖల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వాటి బారినపడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు కళాశాలలు, విద్యాసంస్థల్లోనూ అవగాహన కార్యక్రమాలను రానున్న రోజుల్లో విరివిగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని, కేసులు కూడా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశ అనంతరం హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ రూపొందించిన గంజాయి మరియు మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించిన నినాదాలు పట్టికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి, సతీష్ బాబు, టిజిఏన్బి డి.ఎస్.పి రమేష్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ ప్రహసిత్, డాక్టర్ ఆచార్య వి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మృతిని కుటుంబానికి చల్లా పరామర్శ



పరకాల, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో వివిధ కారణాలతో మృతిచెందిన పుల్ల సారయ్య, దగ్గు గోపమ్మ పార్థివదేహాలను సందర్శించి నివాళులు అర్పించిన పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలను ఓదారుస్తూ వారి మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ సభ్యుల ఆర్థిక సహాయం



కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి ఆటో యూనియన్ జగ్గయ్యపేట సుల్తాన్పూర్ గ్రామస్తుడు తోటి మిత్రుడు శ్రీ కొండ రాజేశ్వర్ వారి తండ్రి దర్మయ్య పరమపదించినారు. నిరుపేద కుటుంబానికి చెందిన కొండ రాజేశ్వరరావుకి తమ వంతు సహాయంగా తోటి మిత్రులు శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి ఆటో యూనియన్ డ్రైవర్స్ 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పోతిరెడ్డి సాంబయ్య, వైస్ ప్రెసిడెంట్ బొంగు బిక్షపతి, క్యాషియర్ మార్క కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తప్పని యూరియా కష్టాలు





కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్ ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల సొసైటీలో యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. యూరియా బస్తాల కోసం ఉదయం 7 గంటల నుండి పడిగాపులు కాస్తున్నామని ఒక మహిళ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజుల నుండి ఒక యూరియా బస్తా కోసం ఉదయాన్నే సొసైటీ దగ్గరికి రావడం బస్తాలు దొరకక వెనితెరిగి పోవడం జరుగుతుందన్నారు. ఒక్కో కుటుంబంలో ఐదు లేదా ఆరు బస్తాలు ఇస్తున్నారని ఒక రైతు ఏకంగా అధికారుల ముందు గోడును వెళ్ళబోసుకున్నారు. ఇలా చేస్తుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని రైతులు హెచ్చరించారు. అలా అయితే చిన్న సన్న కారు రైతుల పరిస్థితి ఎలా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను గమనించిన స్థానిక ఎస్సై దివ్య సాకపురం వెంటనే పరిస్థితులను పర్యవేక్షించి బందోబస్తు నిర్వహించారు.

## ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షునిగా మరిగిద్ద రామారావు



కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని కొనరావుపేట, కొత్తపల్లి, గ్రామాలలోని ట్రాక్టర్స్ యూనియన్ ఎన్నికల్లో మరిగిద్ద రామారావును ఏకగ్రీవంగా ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలియజేశారు. నా ఎన్నికకు సహకరించిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో ముత్యం సతీష్, కోడెల సురేష్, లింగంపెల్లి తిరుపతి, నూనె రాంబాబు, చిలువేరు రాజు, బోయిని సాంబయ్య, పెండ్యాల మాధవరెడ్డి, సంకటి రాజు, జవ్వాజి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో యూరియా పంపిణీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



గూడూరు, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గురువారం గూడూరు మహబూబాబాద్ జిల్లా మండలంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న యూరియా పంపిణీని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్ లోని యూరియా నిల్వలను వ్యవసాయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. క్యూ లైన్ లో ఉన్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని, ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి రైతులకు కలగవద్దని అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేయాలని పద్ధతి ప్రకారం యూరియా పంపిణీ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలని అన్నారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగభావాని, వ్యవసాయ అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు ఉన్నారు.

# ప్రజారోగ్యంపై అధికారులు దృష్టి పెట్టాలి

## పాఠశాలల్లో, వసతి గృహాలల్లో విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలి : జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్





మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ గూడూరు మండలం లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మండల ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు వచ్చే పేషెంట్ లకు సరిపడా మందులు ఉండేలా వైద్యాధికారులు తగు చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో పేషేంట్ లకు అందుతున్న వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయం లోని వంటగదిని, విద్యార్థుల వసతి గదులను, విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజన సదుపాయాలపై పరిశీలించారు. విద్యార్థుల యొక్క గదులు పరిశుభ్రంగా ఉండాలని మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అందరికి యూరియా అందుబాటులో ఉంటుంది





మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): రైతు భరోసా డేటా ఆధారంగా యూరియా పంపిణీ 6 సొసైటీ కేంద్రాల లో ఒకే రోజు 75 టన్నుల యూరియా పంపిణీ అందరికీ అందుబాటులో యూరియా. జిల్లా కలెక్టర్అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశానూసారం గురువారం రైతులకు రైతు భరోసా డేటా ప్రకారం ముందస్తు సమాచారంను సొసైటీల ద్వారా, వ్యవసాయ శాఖ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సిబ్బంది ద్వారా సమాచారం అందించి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న ఆధ్వర్యంలో నెల్లికుదురు మండలంలో ఆరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కేంద్రాలలో 75 మెట్రిక్ టన్నుల యూరియాను ఏకకాలంలో రైతులకు సక్రమంగా పంపిణీ చేశారన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో తహసిల్దార్ నరేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్, ఎస్ఐ రమేష్, సమస్త వ్యవసాయ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధికారులు, సిబ్బంది , రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): రామవరం మాత శిశు ఆరోగ్య కేంద్రంలోని సెంట్రల్ మెడికల్ స్టోర్ ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టోర్‌లో నిల్వ ఉంచిన ఔషధాల లభ్యత, నాణ్యత, గడువు తేది, ఆసుపత్రులకు సరఫరా ప్రక్రియలను పరిశీలించారు. రోగులకు అవసరమయ్యే ఔషధాలు ఎల్లప్పుడూ సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గడువు ముగిసిన మందులను తక్షణమే తొలగించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సెంట్రల్ మెడికల్ స్టోర్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ప్రధాన రహదారి నుండి స్టోర్‌కు వచ్చే రహదారి మరమ్మత్తులు చేయాలని, స్టోర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మందుల నిల్వ రాకులు, బరువైన బాక్సులు ఎత్తడానికి అవసరమైన యంత్రాలను సమకూర్చాలని కోరగా స్పందించిన కలెక్టర్ అవసరమైన అన్ని సదుపాయాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్టోర్‌లోని ఒక హాల్ ఫ్లోరింగ్ పనులు పెండింగ్లో ఉన్న విషయాన్ని ఆయన గమనించారు. ఈ పనులను పూర్తిచేయడానికి అవసరమైన వ్యయంపై తక్షణమే నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించి, ఫ్లోరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వాడుకలోకి తేవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం దృష్ట్యా మెడికల్ స్టోర్ల సమర్థవంతమైన నిర్వహణ అత్యంత కీలకమని, అవసరమైన సదుపాయాల కల్పనలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. మందులు కొరత రాకుండా సంబంధిత అధికారులు అవసరమైన ఇండెంట్లు సకాలంలో పంపించాలి, ప్రతి రోగికి అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతి అధికారికి, సిబ్బందికి ప్రజా ఆరోగ్యం అత్యున్నత ప్రాధాన్యతగా ఉండాలని, వైద్య రంగంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సీనియర్ ఫార్మసీ అధికారి శారద, ఫార్మసిస్ట్ అధికారి రామచందర్, సెంట్రల్ మెడికల్ స్టోర్స్ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయండి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

## కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్





హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): పీవీ విజ్ఞాన కేంద్రంలో మిగిలిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విజ్ఞాన కేంద్రంలో ఫోటో గ్యాలరీ, సిసి రోడ్ నిర్మాణ పనులు, ల్యాండ్ స్కేపింగ్ పనులు, ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతి గురించి పర్యాటకశాఖ డిఈ ధనరాజ్, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీవీ విజ్ఞాన కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విజ్ఞాన కేంద్రానికి సంబంధించిన అన్ని అభివృద్ధి పనులు తప్పనిసరిగా శనివారం నాటికి పూర్తి కావాలన్నారు. మిగిలిన పనులలో ఫర్నిచర్, గ్లాస్ ఫిక్సింగ్, పెయింటింగ్, ప్లాంటేషన్, తదితర పనులు వేగంగా శనివారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, పర్యాటకశాఖ ఏటీవో సూర్య కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ రాము కుటుంబానికి టి.ఎస్.జే.యూ నేతల పరామర్శ



పలిమెల, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల మండల జర్నలిస్ట్ సోన్నారి రాము తండ్రి కీ.శే. సోన్నారి సమ్మయ్య ఇటీవల మరణించగా గురువారం దశ దిన ఖర్మకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ( ఎన్ యు జె ఐ ) నేతలు హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించారు. చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిఎస్జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్,జిల్లా సంయుక్త కార్యదర్శి కడపాక రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను పూర్తి కావాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులలో భాగంగా మిగిలిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన అభివృద్ధి పనులు, ఇంకా పూర్తి కావాల్సిన అభివృద్ధి పనుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జంక్షన్ సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ లైట్ల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, స్థానిక తహసిల్దార్ ఏవిఎన్వి ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు - లక్షన్నర ఆదాయం





తొర్రూరు, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గురువారం మహబూబాబాద్ జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తొర్రూరు, నెల్లికుదురు మండలం లోని పలు గ్రామాలలో ఉద్యాన పంటలు పరిశీలించి రైతులకు పలు సూచనలు ను చేశారు. రైతులు ఎత్తు మడులు, మల్చింగ్, పందిరి సాగు, ట్రెల్లిస్ సాగు, సేంద్రియ పద్ధతులు పాటించాలని అన్నారు. బోర్లు బావులు కింద ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్లు, పూలు, పసుపు,మునగ, మల్బరీ మొదలైన మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసి ఎకరానికి లక్షన్నర వరకు ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి బి. మానస, హార్టికల్చర్ విస్తరణ అధికారి టి. విజయ్ పాల్ రెడ్డి, బిందు సేద్య జిల్లా కోఆర్డినేటింగ్ అధికారులు అశోక్, హరీష్, రైతులు రమేష్, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేడారం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): మేడారానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారంలో పర్యటించబోతున్నారు. ఈ నెల 13 లేదా 14న సీఎం రేవంత్ రెడ్డి మేడారంలో పర్యటించి అక్కడ గద్దెల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం మహా జాతర సమయానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రానున్న 100 రోజుల్లోగా మేడారం అభివృద్ధి పనులు పూర్తి కావాలని అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్ డ్యామ్ ల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వారంలో తానే స్వయంగా మేడారంలో పర్యటించి క్షేత్రస్థాయి పనులను పరిశీలిస్తానని చెప్పారు. ఈ మేరకు సీఎం మేడారం టూర్ ఖరారు అయినట్లు సమాచారం.

## హైదరాబాద్ వ్యాప్తంగా దంచికొట్టిన వర్షం

### అధికారులతో సీఎం సమీక్షా ఈ నేపథ్యంలో పలు సూచనలు, ఆదేశాలు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పురాతన ఇళ్లలో ఉన్నవారిని తక్షణమే గుర్తించి ఖాళీ చేయించాలని ఆదేశించారు. కాజ్‌వేలు, కల్వర్టుల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే గురువారం సాయంత్రం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. మోకాళ్ల లోతు నీరు చేరడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. ముఖ్యంగా హయత్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



## బుల్లెట్ ట్రైన్ కోసం రైల్వే కనెక్టివిటీని పరిశీలించాలి

### రైల్వే ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో చర్చించారు. ఈ మేరకు గురువారం రైల్వే ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రైల్వే ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వికారాబాద్ – కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండాలని అధికారులకు సూచించారు. ఇందుకు భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేకు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను అధికారులకు సీఎం వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త రైల్వే లైన్స్ ప్రతిపాదనలను పరిశీలించాలని సీఎం సూచించారు. శంషాబాద్ నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్ కోసం కొత్తగా రైల్వే కనెక్టివిటీ అంశాన్ని పరిశీలించాలని సీఎం తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్‌తో పోలిస్తే కొత్త లైన్‌తో దూరం కూడా తగ్గుతుందని తెలిపారు.




## సోనియాగాంధీకి దిల్లీ కోర్టులో ఊరట

### ఓటర్ నమోదుపై దాఖలైన కేసు కొట్టివేత

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి దిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ దిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గత నెల భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు– సోనియా పేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని వెల్లడించారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని విమర్శించారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌దారు వికాస్ త్రిపాఠి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది పవన్ నారంగ్ బుధవారం ఈ పిటిషన్‌పై వాదన వినిపించారు. ముందుగా పౌరసత్వ పరిమితిని పూర్తి చేయాలని, తర్వాత వారు ఆ ప్రాంత నివాసి అవుతారని పేర్కొన్నారు. 1980లో రేషన్ కార్డు లేదా పాస్‌పోర్ట్ నివాస పత్రంగా ఉ ండిఉంటుందని అన్నారు. ఆమె భారతీయ పౌరురాలైతే.. 1982లో ఆమె పేరును ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. అప్పుడు ఎన్నికల సంఘం రెండు పేర్లను తొలగించిందని, ఒకటి విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సంజయ్‌గాంధీది, మరొకటి సోనియాగాంధీదని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం తప్పును గుర్తించిందని, ఓటర్ల జాబితా నుండి ఆమె పేరును తొలగించాలని ప్రయత్నించిందని నారంగ్ అన్నారు. 1980 సెప్టెంబర్ 4న న్యూఢిల్లీ నియోజకవర్గం ఓటరు జాబితాలో ఆమె చేర్చారని, అనంతరం 1982లో తొలగించారని అన్నారు. భారత పౌరసత్వం పొందిన తర్వాత 1983లో తిరిగి నమోదు చేయబడిందని అన్నారు. 1983లో సోనియాగాంధీ భారత పౌరసత్వం పొందారనే ఆరోపణపై దర్యాప్తు కోసం పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బిఎన్ఎస్ సెక్షన్ 175(4) కింద ఈపిటిషన్ దాఖలు చేయబడింది.

## నేపాల్ ఆందోళనలతో ఖైదీల పరార్

### పారిపోతున్న ఖైదీలపై ఆర్మీ కాల్పులు



**ఖాట్మండ్, సెప్టెంబర్ 11:** నేపాల్ లో జెన్–జెడ్ ఉద్యమకారులు చేపట్టిన ఆందోళనలను ఆసరాగా తీసుకొని జైళ్ల నుంచి ఖైదీలు పరారవుతున్న క్రమంలో రామెచాప్ జైలు నుంచి పారిపోతున్న కొందరు ఖైదీలపై ఆర్మీ బలగాలు కాల్పులు జరిపాయి. దీంతో దేశంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం జైలు గేటు–తాళాలను విరగ్గొట్టి ఖైదీలు పారిపోయేందుకు ప్రయత్నించారని చీఫ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ శ్యామ్‌కృష్ణ థామా పేర్కొన్నారు. వారిని అడ్డగించేందుకు ఆర్మీ బలగాలు కాల్పులు జరిపాయని అన్నారు. ఈ కాల్పుల్లో డజను మందికి పైగా ఖైదీలు గాయపడ్డారని వెల్లడించారు. వారికి వైద్యచికిత్స అందిస్తున్నట్లు– వివరించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉ ందన్నారు. అయితే, కాఠ్‌మాండూ, పోఖరా, లలిత్‌పుర్‌లోని జైళ్ల నుంచి ఇప్పటికే వందలాది మంది ఖైదీలు తప్పించుకున్నట్లు– స్థానిక మీడియా పేర్కొంది. మొత్తం 7,000 మంది ఖైదీలు పరారైనట్లు– తెలుస్తోంది. ఇక, జైలు నుంచి పారిపోయి వస్తున్న నేపాలీ ఖైదీలను భారత సాయుధ పోలీసుదళం సశస్త్ర సీమా బల్ పట్టుకుంది. ఉ త్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ సమీపంలో 22 మంది నేపాలీ ఖైదీలను అడ్డుకున్నట్లు– ఎస్ఎస్‌బీ అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఆందోళనల నేపథ్యంలో సరిహద్దుల్లో ఎస్ఎస్‌బీనే భద్రతను పర్యవేక్షిస్తుంది. దేశంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు–కు సన్నాహాలు జరుగుతున్నాయని కాఠ్‌మాండూ మేయర్ బాలెన్ షా విజ్ఞప్తి చేశారు. గురువారం నిరసనకారులను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. సామాజిక మాధ్యమాలపై నిషేధంతో ప్రారంభమైన జెన్–జెడ్ ఉద్యమం.. అవినీతి వ్యతిరేక ఉద్యమంగా మారి హింసాత్మక ఘటనలకు దారితీసింది. కాఠ్‌మాండూతో సహా పలు నగరాల్లో పెద్దఎత్తున ఘర్షణలు జరగడంతో ఆర్మీ కర్ఫ్యూ విధించింది. ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు 25 మంది ప్రాణాలు కోల్పోగా.. 600 మందికి పైగా గాయపడ్డారు.

## పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

### మెనూ ప్రకారం భోజనం

### విద్యార్థులు శ్రద్ధ గా చదవాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





జనగామ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జనగామ మండలం చౌడారం లోని మాడల్ స్కూల్, కేజీవీబీని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పాఠశాల ల పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలను తొలగించాలని,శానిటేషన్ నిర్వహించాలన్నారు. విద్యార్థులు కూడా వారి రూమ్ లను నీట్ గా పెట్టుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల దగ్గరికి వెళ్లి ఆహారం ఎలా ఉంది. మెనూ ప్రకారం ఉ ంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని. విద్యార్థులు మంచిగా తింటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం 9,10 వ విద్యార్థులతో మాట్లాడుతు ఉ దయం ఎన్ని గంటలకు నిద్ర లేస్తున్నారు. లేచాక మీరు ఎ ఎ పనులకి ఎంత సమయం కేటాయిస్తున్నారు అని ఒక్కో విద్యార్థి ని అడిగి తెలుసుకున్నారు. 10 వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు రావాలి అంటే ఇప్పటి నుండే ఒక ప్రణాళిక పెట్టుకోవాలన్నారు. కష్టంగా ఉన్న సబ్జెక్ట్ ల పైన ఎక్కువ ఫోకస్ పెట్టడం, రివిజన్ చేయడం లాంటివి ఇప్పటి నుండే అలవాటు చేసుకోవాలన్నారు. 10వ తరగతిలో మంచి మార్కులను స్కోర్ చేసి పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంల్లో ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వసతి గృహాలలో పేరెంట్స్ కమిటి మీటింగ్స్

### జిల్లా షెడ్యుల్ కులముల అభివృద్ధి శాఖ అధికారి



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): షెడ్యూల్ కులముల కమీషనర్ ఆదేశానుసారం ఈ నెల 13వ తారీఖున మహబూబాబాద్ జిల్లా లోని అన్ని వసతి గృహాలలో పేరెంట్స్ కమిటి మీటింగ్స్ జరపాలని నిర్ణయించినారని జిల్లా షెడ్యుల్ కులముల అభివృద్ధి శాఖ అధికారి ఎం. నరసింహస్వామి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి సమావేశానికి విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు మరియు జిల్లా ఆఫీస్ నుండి అధికారులు హజరై తల్లిదండ్రులు వెలిబుచ్చే అభిప్రాయాలపై అందులోని మంచి చెడులపై మన జిల్లాలోని వసతి గృహాలలో ఏ రకమైనటువంటి చర్యలు తీసుకోవాలో ఆలాగే మనం చేపడుతున్న కార్యక్రమాలను వివరించడం వలన కూడా వసతి గృహ నిర్వహణ పట్ల తల్లిదండ్రుల యొక్క అలోచనలో కూడా ఒక రకమైనటువంటి స్పష్టత వస్తుందని అలాగే ఈ కార్యక్రమానికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మరియు మెడికల్ మరియు హెల్త్ డిపార్టుమెంటు సిబ్బందిని అతిదులుగా ఆహ్వానించాలని వసతి గృహ అధికారులకు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్లో జిల్లా ఉద్యోగులు సెలెక్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ప్రతి సంవత్సరం జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే క్రీడా పోటీలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఉద్యోగు లు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి సిహెచ్ రఘు తెలిపారు. ఖో ఖో క్రీడా లో సి హెచ్ ఆనంద్, ఫిజికల్ డైరెక్టర్ టేకుమాట్ల, కబడ్డీ క్రీడకు గాన సిహెచ్ సరస్వతి ఫిజికల్ డైరెక్టర్ జెడ్ పి హెచ్ ఎస్ తాడిచర్ల, వాలీబాల్ క్రీడకు గాని కే జ్యోతి ఫిజికల్ డైరెక్టర్, జెడ్ పి హెచ్ ఎస్, మహా ముత్తారం, కే మమత ఫిజికల్ డైరెక్టర్, జెడ్ పి హెచ్ ఎస్, పెద్దాపూర్, పాపికొండలు జి విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్, జి పూర్ణిమ ,ఫిజికల్ డైరెక్టర్, జడ్.పి.హెచ్.ఎస్, మహాదేవపూర్ గర్ల్స్, కే మమత ఫిజికల్ డైరెక్టర్ జెడ్ పి హెచ్ ఎస్ పెద్దాపూర్, అథ్లెటిక్స్ క్రీడకి గాను సిహెచ్ సరస్వతి ఫిజికల్ డైరెక్టర్, హెచ్ రమేష్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అజామ్ నగర్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, చెస్ క్రీడకి గాను బీ.కొమలత, ఎస్ జి టి, ఎం పి పి ఎస్ కేశవాపూర్, స్పందన ,ఎస్ జి టి, ఎంపీపీ ఎస్ ఎల్కేశ్వరం. జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన ఉద్యోగులకు క్రీడా శాఖ తరుపున అభినందనలు, జాతీయ స్థాయిలో జిల్లా కి క్రీడా లలో మంచి పేరు తేవాలి అని ఆకాక్షించారు. సి హెచ్ రఘు, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ, జయశంకర్ భూపలపల్లి జిల్లా.

# బంగ్లాదేశ్ బోణీ

## హాంకాంగ్‌పై ఘన విజయం..



ఆసియా కప్ టీ20 2025లో బంగ్లాదేశ్ జట్టు అద్భుత విజయం నమోదు చేసింది. గ్రూప్-బీలో తమ మొదటి మ్యాచ్‌లోనే హాంకాంగ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇంకా 14 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేధించిన బంగ్లా.. టోర్నమెంట్ ప్రయాణాన్ని విజయంతో ప్రారంభించింది. మరోవైపు, ఇది హాంకాంగ్‌కు వరుసగా రెండో ఓటమి కావడంతో, టోర్నమెంట్లో వారిపై ఒత్తిడి పెరిగింది.

**హాంకాంగ్ బ్యాటింగ్..**

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్, తమ బౌలింగ్ విభాగంతో ఆకట్టుకుంది. తంజీమ్ హసన్ సాకిబ్ (2/21), రిషద్ హొస్సేన్ (2/31) కీలక వికెట్లు తీసి హాంకాంగ్‌ను కట్టడి చేశారు. మహెది హసన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్ కూడా కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడంతో హాంకాంగ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 143 పరుగులకు పరిమితమైంది. హాంకాంగ్ తరపున కెప్టెన్ నిజాకత్ ఖాన్ (40 బంతుల్లో 42 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

**బంగ్లాదేశ్ ఛేజింగ్..**

ఇక 144 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన బంగ్లాదేశ్ ఆరంభంలో తడబడింది. పవర్‌ప్లేలోనే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు పర్వేజ్ హుస్సైన్ ఎమోన్ (14), తంజీద్ హసన్ (14) తక్కువ స్కోరుకే అవుటయ్యారు. ఆ సమయంలో.. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన లిటన్ దాస్, తౌహిద్ హ్రిదోయ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను స్థిరపరిచాడు.

ఈ జోడీ మూడో వికెట్‌కు 95 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. లిటన్ దాస్ కేవలం 39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 59 పరుగులు చేసి జట్టు విజయాన్ని సులభతరం చేశాడు. అతని దూకుడు ఇన్నింగ్స్%ా% బంగ్లాదేశ్‌కు విజయాన్ని అందించింది.

చివరికి, లిటన్ దాస్ ఔటైన తర్వాత, తౌహిద్ హ్రిదోయ్ (36 బంతుల్లో 35, నాటౌట్) క్రీజులో ఉండి జట్టును విజయతీరాలకు చేర్చాడు. బంగ్లాదేశ్ 18వ ఓవర్లోనే లక్ష్యాన్ని చేరుకుని 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

హాంకాంగ్ బౌలర్లలో అతీక్ ఇక్బాల్ (2/14) ఒక్కడే ఆకట్టుకోగా, మిగతా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. హాంకాంగ్‌కు 143 పరుగుల లక్ష్యం బంగ్లాదేశ్‌ను ఆపలేకపోయింది.

# భారత్-పాకిస్తాన్ మ్యాచ్ రద్దు అవుతుందా?



ఆసియా కప్ 2025లో భారత జట్టు అద్భుతమైన ప్రారంభం చేసింది. మొదటి మ్యాచ్‌లో భారత్ యూఏఈని 9 వికెట్ల తేడాతో ఓడించింది. ఇప్పుడు టీమ్ ఇండియా తదుపరి మ్యాచ్ సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో ఆడాల్సి ఉంది. అయితే, అంతకంటే ముందు ఈ మ్యాచ్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. కొంతమంది లా విద్యార్థులు భారత్-పాక్ మ్యాచ్‌ను రద్దు చేయాలని ఈ పిటిషన్ వేశారు. పహల్గామ్ దాడి తర్వాత మ్యాచ్ నిర్వహించడం ప్రజలను, అమరులైన భారత సైనికులను అవమానించడమేనని వాదనలు వినిపించారు.గురువారం నాడు సుప్రీంకోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. నలుగురు లా విద్యార్థులు ఊర్వశి జైన్ నేతృత్వంలో పిటిషన్ దాఖలు చేశారు. ఊర్వశిని జస్టిస్ జె.కె. మహేశ్వరి, విజయ్ బిష్ణోయ్ ముందు ప్రవేశపెట్టగా, మ్యాచ్‌ను ఆపకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది.పిటిషనర్ల తరపు న్యాయవాది ఈ కేసును శుక్రవారానికి వాయిదా వేయాలని కోరారు. మ్యాచ్ ఆదివారం, సెప్టెంబర్ 14న జరగాల్సి ఉంది. అయితే, సుప్రీంకోర్టు ధర్మాసనం "మ్యాచ్‌ను ఆపకూడదు" అని పేర్కొంది. మరోవైపు న్యాయవాది మళ్లీ డిమాండ్ చేస్తూ కనీసం కేసును రిజిస్టర్ చేయాలని కోరగా, సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంగా తిరస్కరించింది. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్-పాకిస్తాన్ మ్యాచ్ నిర్వహించడం దేశ గౌరవానికి భంగం కలిగించడమేనని, అమరులైన భారత సైనికులు, ప్రాణాలు కోల్పోయిన వారిని అవమానించడమేనని వాదనలు వినిపించారు. క్రికెట్‌ను దేశ ప్రయోజనాల కంటే ఎక్కువ పరిగణించకూడదని వాదించారు.

# అభిషేక్ శర్మ వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్

## కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రశంసల జల్లు



విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మపై టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రశంసల జల్లు కురిపించాడు. పరిస్థితులతో సంబంధం లేకుండా చెలరేగడమే అభిషేక్ శర్మ శైలి అని కొనియాడాడు. ఈ కారణంతోనే అతను వరల్డ్ నెంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా నిలిచాడని తెలిపాడు. ఆసియా కప్ 2025లో భాగంగా యూఏఈతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. అభిషేక్ శర్మ(16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30), శుభ్‌మన్ గిల్(9 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 20 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో 93 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది.ఈ మ్యా చ్ అనంతరం మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్.. అభిషేక్ శర్మ అప్రోచ్‌ను ప్రశంసించాడు. పిచ్ కండిషన్స్ గురించి తెలుసుకునేందుకే బౌలింగ్ ఎంచుకున్నానని చెప్పాడు. 'పిచ్ ఎలా ఉందో చూడాలనుకున్నాం. అందుకే టాస్ గెలవగానే బౌలింగ్ ఎంచుకున్నా. రెండో ఇన్నింగ్స్‌లో కూడా వికెట్ అలానే ఉంది. మా కుర్రాళ్లు సమష్టి ప్రదర్శన కనబర్చారు. మైదానంలో మేం మంచి వైఖరితో పాటు శక్తితో ఆడాలనుకున్నాం. అదే మాకు లభించింది. మా జట్టులో చాలా మంది ఆటగాళ్లు ఇటీవల ఛాంపియన్ ట్రోఫీలో ఇక్కడ ఆడారు. పిచ్ బాగానే ఉంది. కానీ కాస్త నెమ్మదిగా ఉంది. స్పిన్నర్ల ప్రభావం ఉంటుంది. ఇక్కడ ఇప్పుడు చాలా వేడిగా ఉంది. కుల్దీప్ యాదవ్ బాగా బౌలింగ్ చేశాడు. హార్దిక్, శివమ్ దూబే, బుమ్రా సహకారం అందించా రు.అభిషేక్ శర్మ ప్రస్తుతం వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్. అందుకు కారణం ఇదే. అతను తన విధ్వంసకర బ్యాటింగ్ తో జట్టుకు టోన్ సెట్ చేస్తాడు. మేం 200 పరుగులు చేయాల్సి ఉన్నా.. 50 పరుగులు లక్ష్యాన్ని చేధించాల్సి ఉన్నా అతని అప్రోచ్ మాత్రం మారదు. ఈ రోజు అతను అద్భుతంగా ఆడాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్ కోసం మా ఆటగాళ్లంతా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ 13 ఓవర్లలో 57 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ అలిషన్ షరఫు(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22), కెప్టెన్ ముహమ్మద్ వసీం (22 బంతుల్లో 3 ఫోర్లతో 19) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత వెరటన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(4/7), పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే(3/3) అద్భుత బౌలింగ్‌తో యూఏఈ పతనాన్ని శాసించారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 4.3 ఓవర్లలోనే వికెట్ నష్టానికి 60 పరుగులు విజయాన్నందుకుంది. అభిషేక్ శర్మ(16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30), శుభ్‌మన్ గిల్(9 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 20 నాటౌట్), సూర్య కుమార్ యాదవ్(2 బంతుల్లో సిక్స్‌తో 7 నాటౌట్) మెరుపు లు మెరిపించారు. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్దిఖి ఒక వికెట్ తీసాడు.

# హార్దిక్ పాండ్యాతో పోల్చడాన్ని ఖండించిన శివమ్ దూబే




శివమ్ దూబే తాను హార్దిక్ పాండ్యాతో తనను పోల్చుకోవడం సరికాదని చెప్పాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్ తనకు అన్నయ్య లాంటివాడని, అతడి నుంచి నిరంతరం నేర్చుకుంటున్నానని తెలిపాడు. బుధవారం, సెప్టెంబర్ 10న దుబాయ్‌లో యూఏఈకి వ్యతిరేకంగా జరిగిన ఆసియా కప్ 2025 గ్రూప్ ఎ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్ తర్వాత దూబే మీడియాతో మాట్లాడాడు. చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ కేవలం నాలుగు పరుగులకు మూడు వికెట్లు తీశాడు. దీంతో భారత జట్టు కేవలం 13.1 ఓవర్లలో యూఏఈని 57 పరుగులకే ఆలౌట్ చేసింది. భారత జట్టు ఇద్దరు మీడియం-పేస్ ఆల్‌రౌండర్లను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉంచింది. జస్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్‌గా ఉన్నాడు. మిగిలిన బౌలింగ్‌కు శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా ఉన్నారు. శివమ్ దూబే కేవలం రెండు ఓవర్లలో మూడు వికెట్లు తీసి తన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. దూబే మాట్లాడుతూ, "హార్దిక్ నుండి నేను నేర్చుకుంటూ ఉంటాను. అతను నాకు అన్నయ్య లాంటివాడు. ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో అతని అనుభవం చాలా ఎక్కువ. అతని నుండి నేను ఎంత నేర్చుకోగలిగితే అంత నేర్చుకోవాలని అనుకుంటున్నాను. నేను ఎప్పుడూ నన్ను అతనితో పోల్చుకోవాలనుకోలేదు" అని చెప్పాడు. దూబే, హార్దిక్ ఇద్దరూ పేస్-బౌలింగ్ ఆల్‌రౌండర్లు. అయితే, భారత జట్టు వారిని వేర్వేరు పాత్రల కోసం ఉపయోగిస్తోంది. ఇద్దరూ 2024లో టీ20 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో ఉన్నారు. హార్దిక్ టీమిండియా లిమిటెడ్ ఓవర్ల ఫార్మాట్‌లో ఒక ముఖ్య ఆటగాడిగా స్థిరపడ్డాడు. కానీ, దూబే ఇంకా తనకి వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాడు. గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి దూబే ఏడు మ్యాచ్‌లలో బౌలింగ్ చేసి ఎనిమిది వికెట్లు తీశాడు. గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ ఇచ్చిన ప్రోత్సాహం గురించి గుర్తు చేసుకుంటూ దూబే.. "కెప్టెన్, కోచ్ నాకు బౌలింగ్ చేస్తానని ముందే చెప్పారు. మాకు నీపై నమ్మకం ఉందని వారు అన్నారు. నా బౌలింగ్ కోచ్ నాకు చాలా విషయాల్లో సహాయం చేశారు. అవకాశం వచ్చినప్పుడు బౌలింగ్ చేసేందుకు నేను రెడీ అవుతున్నాను. ఈ రోజు నా ప్రదర్శన దాని రిజల్ట్" అని అన్నాడు. మోర్కెల్‌తో తన సంభాషణల గురించి దూబే చెబుతూ.. "ఇంగ్లాండ్ సిరీస్‌లో, అతను నాకు కొన్ని ముఖ్యమైన చిట్కాలను అందించాడు. అతను క్రీజ్‌ను ఉపయోగించుకుని, స్టంప్స్‌కు దూరంగా బౌలింగ్ చేయమని చెప్పాడు. అతను నా స్లో బంతులను మెరుగుపరుచుకోవడానికి సలహా ఇచ్చాడు. నేను చాలా కాలం నుండి దానిపై వర్క్ చేస్తున్నాను. అతను నా రన్-అప్‌ను కూడా అడ్జస్ట్ చేయడానికి సహాయం చేశాడు. ఈ మార్పుల వల్ల నేను బాగా బౌలింగ్ చేయగలుగుతున్నాను." అంటూ చెప్పుకొచ్చాడు. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ తెలివిగా దూబేకు బౌలింగ్ అవకాశం ఇచ్చాడు. ఇది రాబోయే కఠినమైన మ్యాచ్‌లకు సిద్ధం కావడానికి భారత్‌కు సహాయపడింది. దూబే ప్రదర్శన జట్టు మేనేజ్‌మెంట్‌కు బౌలింగ్ కాంబినేషన్‌లో మరింత సౌలభ్యం ఇచ్చింది. ఆదివారం (సెప్టెంబర్ 14)న భారత జట్టు తన దాయాది పాకిస్తాన్‌తో దుబాయ్‌లో తలపడనుంది. ఈ హై-ఓక్టేన్ మ్యాచ్‌లో కూడా దూబే తన ఫామ్‌ను కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# మహిళల వన్డే ప్రపంచకప్ 2025కు అంపైర్లంతా మగువలే!





మహిళల వన్డే ప్రపంచకప్ 2025 నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసీసీ) సంచలన నిర్ణయం తీసుకుంది. తొలిసారి మహిళలతో కూడిన పూర్తి స్థాయి అంపైర్ ప్యానెల్, మ్యాచ్ అఫిషియన్స్ జాబితాను ప్రకటించింది. సెప్టెంబర్ 30 నుంచి భారత్, శ్రీలంక వేదికగా జరిగే ఈ టోర్నీలో షాండర్ ఫ్రిట్జ్, ట్రూడీ ఆండర్సన్, జి.ఎస్. లక్ష్మి, మిచెల్ పెరీరా మ్యాచ్ రిఫరీలుగా వ్యవహరించనున్నారు.ఎంతో అనుభవం కలిగిన క్లైర్ పోలోసాక్, జాక్వెలిన్ విలియమ్స్, స్యూ రెడ్‌ఫెర్న్‌లు 14 మంది సభ్యులతో కూడిన అంపైర్స్ ప్యానెల్‌లో ఉన్నారు. గత రెండు ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్‌లు, 2022లో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో పూర్తిగా మహిళా అధికారులు బాధ్యతలు చేపట్టినప్పటికి 13 ఏళ్ల మహిళల వన్డే ప్రపంచకప్ చరిత్రలో మాత్రం ఇదే తొలిసారి. ఇది చారిత్రాత్మక నిర్ణయమని ఐసీసీ ఛైర్మన్ జై షా ప్రశంసించాడు. ఈ నిర్ణయం మహిళల క్రికెట్‌ను మరింత ప్రోత్సహిస్తుందని, మరింత మంది మహిళలు ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకుంటారని చెప్పారు. 'మహిళల క్రికెట్ ప్రయాణంలో ఇది ఓ సంచన నిర్ణయం. ఇది మహిళల క్రికెట్ మరింత అభివృద్ధి చెందేలా చేస్తుంది. పూర్తిగా మహిళా మ్యాచ్ అధికారుల ప్యానెల్‌ను ప్రకటించడం ఓ రికార్డ్ మాత్రమే కాదు. క్రికెట్‌లో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఐసీసీ చేస్తున్న కృషికి ప్రతిబింబం ఇది.'అని జై షా తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొనే 8 జట్లు బరిలోకి దిగుతుండగా.. ఆతిథ్య దేశాలైన భారత్, శ్రీలంక మధ్య సెప్టెంబర్ 30న గౌహతి వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ టోర్నీకి తెరలేవనుంది. అంపైర్లు: లారెన్ ఏజెన్‌బాగ్, కాండస్ లా బోర్డే, కిమ్ కాటన్, సారా దంబనేవానా, షాతిరా జాకిర్ జెసీ, కెర్రిన్ క్లాస్టే, జననీ ఎన్, నిమలి పెరీరా, క్లైర్ పోలోసాక్, వ్రిందా రాఠీ, స్యూ రెడ్‌ఫెర్న్, ఎలోయిస్ షెరిడాన్, గాయత్రి వేణుగోపాలన్, జాక్వెలిన్ విలియమ్స్

మ్యాచ్ రిఫరీలు: ట్రూడీ ఆండర్సన్, షాండ్రే ఫ్రిట్జ్, జి.ఎస్. లక్ష్మి, మిచెల్ పెరీరా



# సర్‌ప్రైజింగ్ లుక్‌లో తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయింది. అప్పుడు ఎంత అందంగా ఉందో, కెరీర్ ఆరంభంలో ఎంత జోష్‌తో ఉండేదో ఇప్పుడు అదే స్థాయి అందంగా, అదే స్థాయి జోష్‌తో కనిపిస్తోంది. తమన్నా అందంతో పాటు నటనలో మంచి ప్రతిభ ఉన్న నటి, అంతే కాకుండా డాన్స్ విషయంలో చాలా మంది స్టార్ హీరోలతో పోటీ పడి మరీ డాన్స్ వేసిన ఘనత ఆమెకు దక్కింది. అలాంటి మిల్కీ బ్యూటీ తమన్నా ఈ మధ్య కాలంలో కెరీర్ పరంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. వ్యక్తిగతంగా లవ్ బ్రేకప్ మొదలుకుని స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు దక్కించుకోలేక పోవడం వరకు చాలా విషయంలో తమన్నా కాస్త ఇబ్బందిని ఎదుర్కొంటుంది. అందం విషయంలో మునుపటితో పోల్చితే మరింతగా అందంగా తయారు అయినప్పటికీ ఈమెను ఫిల్మ్ మేకర్స్ సినిమాల్లో ఎంపిక చేయడం లేదు. తమన్నా గ్రీన్ డ్రెస్ లో విభిన్నమైన హారం ధరించి, సింపుల్ లూజ్ హెయిర్ స్టైల్‌తో పెద్దగా మేకప్ లేకుండానే కనిపించింది. బ్రా లెస్ డ్రెస్ తో తమన్నా ఎప్పుడూ కన్నుల విందు చేస్తూ ఉంటుంది. ఈసారి కూడా మిల్కీ బ్యూటీ తమన్నా చూపులను తనవైపు తిప్పుకునేందుకు ఈ గ్రీన్ డ్రెస్ లో కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఉంటే నెటిజన్స్ ఫోటోలను ఏ స్థాయిలో వైరల్ చేస్తారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు అదే తరహాలో తాజా తమన్నా ఫోటోలను నెటిజన్స్ తెగ లైక్ చేస్తూ షేర్ చేస్తున్నారు. తమన్నా అఫిషియల్‌గా ఈ ఫోటోలను తన ఇన్‌స్టా పేజీలో షేర్ చేయలేదు. కానీ మీడియా వారు తీసిన ఈ ఫోటోలను షేర్ చేసిన సమయంలో వైరల్ అవుతున్నాయి.



## నేడు థియేటర్లలోకి మిరాయ్ మూవీ

హను-మాన్' చిత్రంతో నటుడిగా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాడు తేజ సజ్జా సూపర్‌హీరో మూవీ 'మిరాయ్' తో మరోసారి ప్రేక్షకులకు కొత్త అనుభూతి పంచేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ విజువల్స్‌తో సినీ ప్రియుల్లో అంచనాలు పెంచింది. రాముడి పాత్రలో స్టార్ హీరో నటించారంటూ ప్రచారం జరగ్గా, ఏఐ సాయంతో ఆ క్యారెక్టర్ రూపొందించారని మరోవైపు రూమర్లు వచ్చాయి. -ట్రైలర్‌లో రాముడిని పూర్తిగా చూపించని చిత్ర బృందం థియేటర్లలోనే ప్రేక్షకులకు ఆ సర్‌ప్రైజ్ ఇవ్వనుంది. తనకు బాల్యం నుంచీ సోషియో ఫాంటసీ చిత్రాలంటే ఇష్టమని తేజ చెప్పాడు. నిజ జీవితంలో చేయలేని మ్యాజిక్స్‌ను తెరపై చూపించడంలో థ్రిల్ ఉంటు-oదని పేర్కొన్నాడు. మిరాయ్ అంటే భవిష్యత్తుపై ఆశ అని తెలిపాడు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో మంచు మనోజ్ విలన్‌గా కొత్త కోణాన్ని ఆవిష్కరించనున్నారు. శ్రియ కీలక పాత్ర పోషించారు. రితికా నాయక్ హీరోయిన్.



## ఎన్టీఆర్ మూవీతో రుక్మిణి సెంటిమెంట్ బ్రేక్ అయ్యేనా?

కన్నడ మూవీ 'సప్త సాగరదాచే ఎల్లో' తో తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపుతో రుక్మిణి పలు కన్నడ సినిమాల్లో నటించిన విషయం తెల్సిందే. అదే సమయంలో తెలుగులో 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాలో నటించింది. కన్నడంలో హిట్ సొంతం చేసుకున్న రుక్మిణి వసంత్ తెలుగులో మొదటి సినిమా అప్పుడో ఇప్పుడో ఎప్పుడో తో నిరాశ పరిచింది. టాలీవుడ్‌లో ఈ అమ్మడికి మొదటి సినిమాతోనే ఫ్లాప్ పడింది. ఈ ఏడాది తమిళ్‌లోనూ రుక్మిణి వసంత్ ఎంట్రీ ఇచ్చింది. కోలీవుడ్‌లో ఏస్, మధరాసి సినిమాలతో రుక్మిణి వసంత్ ఎంట్రీ ఇచ్చింది. రెండు సినిమాలు ఈమెకు నిరాశనే మిగిల్చాయి. సౌత్‌లో తక్కువ సమయంలోనే మూడు భాషల్లోనూ నటించే అవకాశాలు వచ్చినప్పటికీ ఈ అమ్మడికి లక్ కలిసి రాకపోవడంతో నిరాశే మిగిలింది.

కేజీఎఫ్, సలార్ మేకర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా రూపొందుతున్న క్రేజీ పాన్ ఇండియా మూవీ 'డ్రాగన్' లో హీరోయిన్‌గా రుక్మిణి నటిస్తున్న నేపథ్యంలో ఆమె క్రేజ్ ఇప్పటికే పెరిగింది. టాలీవుడ్‌లో డ్రాగన్ విడుదలకు ముందే మరిన్ని సినిమాలను చేసే అవకాశాలు దక్కించుకునే అవకాశం ఉంది. కానీ డ్రాగన్ సినిమా విడుదల తర్వాతే తెలుగులో ఈమె సినిమాలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఇప్పటి వరకు రుక్మిణి తెలుగు లో కొత్త సినిమాలకు ఓకే చెప్పలేదు. వచ్చే ఏడాది సమ్మర్ తర్వాత ఎన్టీఆర్ డ్రాగన్ సినిమా విడుదల కాబోతుంది. ప్రశాంత్ నీల్ సినిమా అంటే హీరోయిన్స్‌కు పెద్దగా ప్రాముఖ్యత ఉండదు అంటారు. కానీ ఈ సినిమాలో మాత్రం రుక్మిణి వసంత్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని అంటున్నారు.



## ఐశ్వర్య ఫోటోలు వాడడానికి లేదు

### వాడితే కఠిన చర్యలు తప్పవన్న కోర్టు

ఇకపై ఐశ్వర్య అనుమతి లేకుండా ఆమె ఫోటోలు వాడడానికి వీల్లేదని న్యాయస్థానం ఆదేశించింది. ఐశ్వర్య ఫోటోలు దుర్వినియోగం చేయడం వల్ల ఆమెకు ఆర్థికంగా నష్టం కలిగించడమే కాకుండా ఆమె గౌరవం, ప్రతిష్ఠ ను దెబ్బతీసినట్లేనని కోర్టు పేర్కొంది. ఈమేరకు ఆమె ప్రచార, వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరైనా విడితే కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ హైకోర్టు హెచ్చరించింది. అనుమతి లేకుండా తన ఫోటోలు వాడుతున్నారంటూ ఇటీవల నటి ఐశ్వర్యారాయ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ కేసులో గురువారం న్యాయస్థానం తీర్పునిచ్చింది.

ఐశ్వర్య పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అందులో గుర్తించిన యూఆర్‌ఎల్‌లను తొలగించి బ్లాక్ చేయాలని ఇ-కామర్స్ వెబ్‌సైట్‌లను, గూగుల్ సహా ఇతర ఎ÷-లాట్‌ఫార్మ్‌లను దిల్లీ హైకోర్టు ఆదేశించింది. నోటీ-సులు అందిన 72 గంటల్లోపు పిటిషన్‌లో ఐశ్వర్య పేర్కొన్న యూఆర్‌ఎల్ బ్లాక్ చేయాలని పేర్కొంది. ఆ యూఆర్‌ఎల్స్‌ను ఏడు రోజుల్లో బ్లాక్ చేసేలా ఆదేశాలివ్వాలని కేంద్ర ఐటీ-, సమాచార శాఖకు కోర్టు సూచించింది. ఈ కేసులో తదుపరి విచారణ జనవరి 15న జరగనుంది. ఇక ఇదే విషయంపై ఐశ్వర్య భర్త, నటుడు అభిషేక్ బచ్చన్ కూడా దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలవుతున్న సైయారా




బాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న సైయారా చిత్రం ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ- వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం సెప్టెంబర్ 12 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు- ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయి-న్‌లుగా నటించారు. ఆషిఖీ 2, ఎక్ విలన్ వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత మోహిత్ సూరి దర్శకత్వంలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే జూలై 18న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆ అంచనాలను అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. మొదటిరోజు నుంచే భారీ కలెక్షన్లు రాబడుతున్న ఈ చిత్రం ఇటీవల రూ.581 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టినట్లు- చిత్రబృందం యష్‌రాజ్ ఫిలిమ్స్ ప్రకటించింది. ఈ సందర్భంగా సరికొత్త రికార్డును అందుకుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చి అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా ఈ సినిమా నిలిచింది. కేవలం ఇండియాలోనే రూ.400 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించగా.. వరల్డ్ వైడ్‌గా రూ.169 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ రానుడటంతో ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

## రంగీలా రీ రిలీజ్‌ను ప్రకటించిన రామ్‌గోపాల్ వర్మ




బాలీవుడ్ కల్ట్ క్లాసిక్ సినిమాలలో ఒకటైన 'రంగీలా' సినిమాను రీ రిలీజ్ చే య ు బో త ు న్న ట ్ల ప్రకటించాడు ఆ చిత్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఈ సినిమా విడుదలై సెప్టెంబర్ 8 నాటికి 30 ఏళు ్ల పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ 'అల్ట్రా మీడియా' ఈ సినిమాను త్వరలోనే 4కే వెర్షన్‌లో రీ రిలీజ్ చేయబోతుందని వర్మ సోషల్ మీడియా వేదికగా తెలిపాడు. రంగీలా' సినిమా 1995లో విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో ఆమిర్ ఖాన్, ఊర్మిళ మాతోండ్కర్, జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమాతోనే ఏ.ఆర్. రెహమాన్ బాలీవుడ్‌కి సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రానికి ఆయన అందించిన పాటలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. అయితే ఈ సినిమా మళ్లీ థియేటర్లలో ఎప్పుడు విడుదలవుతుందనేది ఇంకా స్పష్టంగా తెలియదు, కానీ అక్టోబరులో రీ-రిలీజ్ అయ్యే అవకాశం ఉన్నట్లు- తెలుస్తుంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463